ఫటాఫట్

జిల్లాలో 473 పంచాయతీలకు ఎన్నికలు

● గుడిపల్లి రమేష్, జిల్లా పంచాయతీ అధికారి



ప్రశ్న: ఈసారి జిల్లాలో ఎన్ని గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు?

జవాబు: జిల్లాలో మొత్తం 473 గ్రామ పంచాయతీలు, అలాగే మొత్తం 3870 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో 5లక్షల 51వేల మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారు.

ప్ర: ఓటరు జాబితాను ఫైనల్ చేస్తున్నారా?

జ: ఇటీవలే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఓటరు జాబితాను సవరణ చేస్తున్నాం. రెండు, మూడు రోజుల్లో ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని మండల, గ్రామ స్థాయి అధికారులను ఆదేశించాం.

ప్ర: గ్రామాల్లో పారిశుధ్యం పనులను పకడ్బందీగా నిర్వహిస్తున్నారా?

జ: వానాకాలం సీజన్ ప్రారంభంకావడంతో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టిని సారిస్తున్నాం. గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నాం. మురుగు నీటి కాల్వలను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్, ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడేను నిర్వహిస్తున్నాం.

ప్ర: గ్రామ పంచాయతీలకు సరిపడా నిధులు అందుబాటులో ఉన్నాయా?

జ: గ్రామ పంచాయతీలకు రావాల్సిన ప్రత్యేక నిధులు అందకపోయిన పంచాయతీల సాధారణ నిధుల నుంచి అత్యవసర పనులకు ఖర్చు చేస్తున్నాం. ముఖ్యంగా పారిశుధ్యం నిర్వహణ కోసం ట్రాక్టర్ డీజిల్, మల్టీపర్పస్ వర్కర్ల కోసం నిధులను కేటాయిస్తున్నాం.

ప్ర: ఆ మూడు గ్రామ పంచాయతీలకు ఈసారి ఎన్నికలు ఉంటాయా?

జ: బేల మండలంలోని కొబ్బాయి, మాంగ్రూడ్ గ్రామాలతో పాటు ఉట్నూర్ గ్రామ పంచాయతీకి ఈసారి ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఎన్నికల సామాగ్రిని సిద్ధం చేసుకోవడం జరిగింది. రిజర్వేషన్ పూర్తయితే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది.

- ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి



బోరజ్ మండలంలోని సరిహద్దు ప్రాంతం



బేల మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు



తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు

మందుపై.. ముందుచూపు!

» జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలపై నేతల ప్రత్యేకదృష్టి » సరిహద్దు గ్రామాల్లో జోరుగా మద్యం అక్రమ నిల్వలు » అధికారుల తనిఖీలతో పట్టుబడుతున్న దేశీదారు మద్యం » సరిహద్దు చెక్‌పోస్టులపై కరువవుతున్న నిఘా » సమాచారం ఇస్తేనే ఎక్సైజ్ శాఖ అధికారుల హడావిడి

> **త్వరలోనే..** స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం ఖాయమన్న వార్తలు రావడంతో ఆశావహ నేతలు అప్రమత్తమవుతున్నారు. ముఖ్యంగా మందుపై ముందుచూపుతో ఉన్నట్లు కనిపిస్తుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే మద్యాన్ని సమకూర్చుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మహారాష్ట్రలో తమకున్న పరిచయాలు, పలుకుబడితో మద్యాన్ని దిగుమతి చేసుకుంటూ రహస్య ప్రదేశాలలో భారీగా డంప్ చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. జిల్లాలోని 20 మండలాల పరిధిలో 473 గ్రామ పంచాయతీలు, 166 ఎంపీటీసీ, 20 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుంది. దీంతో ఎన్నికల్లో గెలిచేందుకు ఆశావహ నేతలు అన్నిరకాల అస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నారు.

ఆదిలాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జిల్లాలోని బేల, జైనథ్, తాంసి, తలమడుగు, భీంపూర్, బోథ్, నార్నూర్ మండలాల మీదుగా అక్రమ మద్యాన్ని దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. మహారాష్ట్రలోని మాండ్వి, కిన్వట్, పఠాన్ బోరీ, కొర్పానక, పిప్పల్‌కోటి ప్రాంతాల మీదుగా జిల్లాకు దేశీదారు మద్యాన్ని తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. గత కొద్ది రోజులుగా జిల్లాలో దేశీదారు మద్యం నిల్వలు వరుసగా పట్టుబడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అయినా అధికారులు అప్రమత్తమైనట్లు కనిపించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఇటీవల భారీగా దేశీదారు మద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ శాఖాధికారులు(ఫైల్)

ముందస్తు ఆర్డర్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న ఆశావహ నేతలంతా మద్యం కోసం ముందస్తు ఆర్డర్లను చేస్తున్నట్లు తెలుస్తుంది. ఎన్నికలకు ముందే ఆర్డర్ ఇస్తున్న వారికి మద్యం ధరలో ప్రత్యేక డిస్కౌంట్ కూడా ఇస్తున్న ట్లు సమాచారం. ఎన్నికల హడావిడి మొదలైతే మద్యం దిగుమతి, సరఫరాకు ఇబ్బందులు ఉంటాయని భావిస్తున్న వారంతా ముందుగానే సరిపడా మద్యాన్ని ప్లాన్ చేసుకుంటున్నారు. మద్యదళారులను ఆశ్రయిస్తూ మద్యాన్ని సమకూర్చుకుంటున్నారన్న టాక్ వినిపిస్తుంది. మహారాష్ట్రలో చౌకగా దొరికే దేశీదారు మద్యాన్ని డంప్ చేస్తున్నారు. మద్యం వ్యాపారులు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భారీగా మహారాష్ట్ర మద్యాన్ని దిగుమతి చేసుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ.. రూ.లక్షలు వెనుకేసుకుంటున్నారు. అంతేకాకుండా ఇటీవల జిల్లాలో తరచుగా దేశీదారు మద్యం పట్టుబడడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

ముమ్మరంగా తనిఖీలు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో భారీగా అక్రమ మద్యం నిల్వలు పట్టుబడుతున్నాయి. ముఖ్యంగా సరిహద్దు మండలాలపైనే అధికారులు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. దీంతో రూటు మార్చుతున్న వ్యాపారులు అధికారుల కళ్లు గప్పి పెన్‌గంగా నది మీదుగా కాలినడకన జిల్లాలోకి భారీగా మద్యాన్ని తరలిస్తూ.. అమ్మేసుకుంటున్నారు. వివిధ మార్గాల్లో దేశీదారు మద్యాన్ని తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో అధికారులు దాడులు చేస్తున్న అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. సరిహద్దుల్లో హద్దులు

(తరువాయి 6వ పేజీలో...)



మంత్రి లక్ష్మణ్‌ను కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు

మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కొమురంభీం కన్జర్వేషన్ టైగర్ కారిడార్ ఏర్పాటు కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 49 నిలుపుదలకు ప్రత్యేక కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. అంతేకాకుండా జీవోను రద్దు చేయడంలో ఆదివాసీల ఆవేదనను ప్రభుత్వానికి తెలపడంలో మంత్రులు కీలక పాత్ర పోషించారన్నారు.

నేడు కొత్త రేషన్ కార్డుల పంపిణీ

ఉట్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త రేషన్‌కార్డులను గురువారం మండల కేంద్రంలోని హెచ్‌కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో పంపిణీ చేస్తామని ఇన్‌చార్జీ తహసీల్దార్ జాదవ్ అమృతలాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ హాజరై కార్డులు పంపిణీ చేస్తారన్నారు. మండలానికి 571 కొత్త కార్డులు మంజూరు కాగా 1510 కార్డులలో కొత్త పేర్లు చేర్చడం జరిగిందన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ నగేష్

ఆదిలాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలంటూ ఎంపీ గోడం నగేష్ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసి చర్చించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి ఇప్పటికే అధికారులతో సమావేశం నిర్వహించి చర్చించడం జరిగిందన్నారు. త్వరలోనే మరోసారి రక్షణ శాఖ విమానయాన రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతామని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయ ఏర్పాటు విషయంలో తగు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ నగేష్ పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్

ఐటీడీఏ పాఠశాలల్లో యంగ్ లీడర్స్ క్లబ్‌లు

● గిరిజన సంక్షేమ శాఖ డీడీ జాదవ్ అంబాజి ● పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఇంగ్లీష్ బోధన ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజి



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

ఉట్నూర్, జూలై23 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలో ఆంగ్ల భాష నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ లీడర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజి అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన ఇంగ్లీష్ బోధన ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆంగ్ల భాష నైపుణ్య సాధన లక్ష్యంగా యంగ్ లీడర్స్ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి 8వ తరగతి వరకు గురువారం, శుక్రవారం ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజన విద్యార్థులు ఇంగ్లీష్ భాషను దారాళంగా మాట్లాడడానికి ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. భారత్ దేఖో సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని ఆశ్రమ పాఠశాలల్లో చేపడుతున్నామన్నారు. ముందుగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన అనంతరం 6 నుంచి ఎనిమిది తరగతుల వరకు ఉన్న విద్యార్థుల్లో మంచిగా ఇంగ్లీష్ మాట్లాడే విద్యార్థులను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేకాకుండా శిక్షణ పొందిన విద్యార్థులను మిగతా విద్యార్థులతో కలిపి బృందాలుగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ వారం విద్యార్థులకు కృత్యాల ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యంగ్ లీడర్ క్లబ్ నృత్యాలు ప్రతీ గురువారం శుక్రవారం నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రతీ గురు, శుక్రవారం విద్యార్థులు తమ తల్లిదండ్రులు గురువుల ముందు ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులకు ప్రశంస పత్రాలు అందివ్వడం జరుగుతుందన్నారు. మూడు రోజులు జరుగనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో భారత దేఖో సంస్థ డైరెక్టర్ రోమిళ్ల, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో తరగతులను బహిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు



తాంసిలో పాఠశాలల నుంచి ఇంటికి వెళుతున్న విద్యార్థులు

విద్య పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

● పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మడావి గణేష్ ● జిల్లాలో విద్యా సంస్థల బంద్ విజయవంతం

ఆదిలాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మడావి గణేష్ అన్నారు. బుధవారం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్ విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ విద్యారంగంపై సవతితల్లి ప్రేమను చూపుతుందని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గణేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మేస్రం భాస్కర్‌లు ఆరోపించారు. బంద్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తరగతులను బహిష్కరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇందులో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడంకేశవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కొట్నాక్‌సక్కు, ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి సలాం వరుణ్, సాయికుమార్, అశోక్, రాహుల్, కుంటాల నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని బుధవారం తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం అయ్యిందని తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంబ్లెప్రజ్ఞశీల్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగదేవ్ పటేల్ అన్నారు. విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయని, ప్రభుత్వం వెంటనే రూ.8158 కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని పలు డిమాండ్‌లు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాడి వెంకటేశ్‌నేత, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి: ఏఐవైఎఫ్ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన పాఠశాలల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల్లోకి ఏఐవైఎఫ్ నాయకులు వెళ్లి పాఠశాలలు మూసివేయించారు. కొద్దిసేపు పాఠశాలలు నడిచిన తర్వాత విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయారు. అదేవిధంగా దుకాణాలను కూడా బంద్ చేసే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి రాము, ఏఐవైఎఫ్ నాయకులు కార్తీక్, ఈశ్వర్, సతీష్, యోగేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

● ఆర్టీసీ సంబరాల్లో కలెక్టర్ రాజర్షిషా

మావల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు నందిస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలన్న దృఢ సంకల్పంతో వారి అభ్యున్నతికి కృషి చేస్తుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సదుపాయాన్ని 200 కోట్ల మంది వినియోగించుకున్న సందర్భంగా బుధవారం జిల్లాకేంద్రం లోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తెస్తూ, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ వసతిని కల్పించిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారని వివరించారు. తద్వారా ప్రయాణ చార్జీల రూపంలో రూ. 6680 కోట్లు మహిళలకు ఆదా అయ్యాయని అన్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. జిల్లాలో 1.75 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసుకున్నారని తెలిపారు. అనంతరం ఆర్టీసీ సంస్థ ద్వారా ఆయా పాఠశాలల విద్యార్థినులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన బాలికలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సలోని,ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోమరాజు భవాని ప్రసాద్, డిపో మేనేజర్ ప్రతిమ, సారధి కళాకారులు ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

● ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా

నార్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం మండలంలోని టీడబ్ల్యూపీఎస్ పాఠశాల దేవ్‌గూడ, అలాగే గిరిజన ఆశ్రమ పాఠశాలు నార్నూర్, బాలికలు గంగపూర్, మనకపూర్‌లను పీవో సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని అన్నారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాల్లో వర్షపు నీరు నిలువకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో



బాలుర వసతి గృహంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

మావల, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మావల, జైనథ్ మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు. ఈ మేరకు ఎంజేపీ మావల బాలురు వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనం, ఉండేందుకు వసతి, హాస్టల్ శుభ్రత, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై పాఠశాల గదులు, డార్మెటరి, వంట గది, బియ్యం నిల్వలను, మెనూ పట్టికను, బోర్ వెల్, ఆర్ ఓ ప్లాంట్ నీటి పరీక్షలను పరిశీలించారు. గత ఏప్రిల్ మాసంలో ఉన్న పాత స్టాక్ బియ్యాన్ని వాపస్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని డీఎంను ఆదేశించారు. పాత స్టాక్ ఉన్న కారణంగా బియ్యంలో పురుగులు వస్తాయని, కొత్త స్టాక్ బియ్యాన్ని వాడుకోవాలని, పాత స్టాక్‌ను రీప్లేస్మెంట్ చేయాలని, నాణ్యతతో కూడిన సరుకులను వాడాలని, విద్యార్థులకు ఇస్తున్న క్వాంటిటీని తగ్గించకుండా ఇవ్వాలని ఆన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

'పేదలకు వరం సీఎం సహాయ నిధి'

భైంసా, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్య చికిత్సలు నిర్వహించుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంగా మారిందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పేర్కొన్నారు, బుధవారం భైంసా మండలంలోని దేగాం గ్రామంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల వాసులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయపు చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇందులో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మెన్ ఎండీ ఫారుఖ్ అహ్మద్, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్, తానూర్ మండల కోలూర్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డితో పాటు ఆయా ప్రాంతాలవాసులు పాల్గొన్నారు.

టీవీలతో సృజనాత్మక శక్తికి దోహదం

మావల, జూలై 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సృజనాత్మక శక్తి పెంపొందించడానికి టీవీలు దోహదం చేస్తాయని మండల విద్యాధికారి సోమయ్య పేర్కొన్నారు. పట్టణంలోని కేఆర్కే కాలనీ ప్రాథమిక పాఠశాలకు సాయి వైకుంఠ ట్రస్ట్ ఛైర్మన్ డా.రవికిరణ్ యాదవ్ టీవీని ఉచితంగా అందచేశారు. ఈ మేరకు ఎంఈఓ మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవ కార్యక్రమాలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్‌లు సల్ల విజయబాబు యాదవ్, కావటి రమేష్ యాదవ్, రవికాంత్ యాదవ్, తెలంగాణ పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి నర్రా నవీన్ యాదవ్, ప్రధానోపాధ్యాయుడు షేక్ అలీ, ఉపాధ్యాయులు శ్రీరామ్, కిరణ్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

మావల, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లదేనని ఆర్టీసీ ఆర్‌ఎం సోమరాజు, భవాని ప్రసాద్‌లు పేర్కొన్నారు.. ఆర్టీసీ డ్రైవర్లకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు ప్రమాదాలు జరగకుండా ఏకగ్రతతో బస్‌లను నడపాలన్నారు. అదే విధంగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ఇందులో డిపో మేనేజర్ ప్రతిమ, ఆర్టీసీ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

షీ టీమ్ సేవలపై అవగాహన

గుడిహత్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం షీటీమ్ సిబ్బంది అవగాహన కల్పించారు. షీ టీమ్ ఏఎస్సై స్రవంతి మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళల భద్రత కోసమే షీ టీంలను ఏర్పాటు చేశారని, అన్ని కళాశాలలు, విద్యా సంస్థల వద్ద, ప్రధానమైన కూడళ్లలలో షీ టీం నిత్యం ఉంటాయన్నారు. ఆకతాయిలు పోకిరీలు ఎవరైనా విద్యార్థినిలను వేధింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ అరే శ్రీనివాస్, షీ టీం కానిస్టేబుళ్ళు వాణి, మోహన్ విద్యార్థులు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థులు చదువులో రాణించాలి'

ఇచ్చోడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండలంలోని నారాయణ్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అమ్మ ఆదర్శ పాఠశాలను బుధవారం కాంప్లేక్స్ ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే అన్నిరకాల సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ మారుమూల గిరిజన విద్యార్థులు విద్యలో ముందంజలో ఉండాలన్నారు. నారాయణ్‌పూర్ గ్రామంలో గతంలో ఏడవ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాల ప్రస్తుతం మూడవ తరగతి వరకు మాత్రమే కొనసాగుతుందని గ్రామస్థులు సహకరిస్తే మూడవ తరగతి వరకు ఉన్న పాఠశాలను ఏడవ తరగతి వరకు అప్‌గ్రేడ్ అయ్యేలా ఐటీడీఏ అధికారులతో మాట్లాడి గ్రామానికి ఏడవ తరగతి వరకు పాఠశాల ఉండేలా కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పి జాదవ్ ప్రకాష్, ఉపాధ్యాయులు సిడాం రాందాస్, గ్రామపటేల్, దేవరి, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ఆరోగ్యంపై అవగాహన

భీంపూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం భీంపూర్ కస్తూర్బా విద్యాలయంలో బుధవారం జాతీయ కీటక జనిత కార్యక్రమంలో భాగంగా మలేరియా, డెంగీ వ్యాధినిరోధక నివారణ నియంత్రణ చర్యలను ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ నికిల్ రాజ్ మాట్లాడుతూ నీటి నిల్వల వల్ల దోమలు వృద్ధి చెందుతాయని నీటి నిల్వలలో, థిమోఫాస్ 50 శాతం మందు పిచికారి చేయాలని, ఈ రసాయన పిచికారి వల్ల దోమల లార్వా వృద్ధి చెందకుండా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సమీర్ ఖాన్, మండల ఆరోగ్య విస్తీరణ అధికారి లింగం పల్లె జ్ఞానేశ్వర్, కళాశాల ఆరోగ్య కార్యకర్తలు మనోజ, అగోగ్య కార్యకర్త జానా భాయి, ఆశ కార్యకర్తలు భారతి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

నార్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెల్త్ సూపర్ వైజర్ చౌవాన్ చరణ్ దాస్ అన్నారు. బుధవారం మండలంలోని రాజులగూడా గ్రామం మెడికల్ క్యాంపు నిర్వహించారు. 33 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం డెంగ్యూ మలేరియా, చికెన్ గునియా, ఇతర వ్యాధులు సోకే ప్రమాదాలు ఉంటాయని జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఐదుగురు రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లవ్ కుమార్ హెల్త్ అసిస్టెంట్ జవహార్ ఏ ఎన్ ఎం జగు, ఆశ నిర్మల, గుంప పాల్గొన్నారు.



రాజులగూడా గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బావను చంపిన బామ్మర్దులు

● కుల దేవతల పండుగకు డబ్బులు ఇవ్వలేదని ఘర్షణ ● తాగిన మైకంలో దాడి ● తలమడుగు మండలంలో ఘటన

తలమడుగు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయాడి గ్రామంలో బుధవారం తాగిన మైకంలో సొంత బావను బామ్మర్దులు హతమార్చారు. తలమడుగు మండలంలోని సకినాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నడింపల్లే గ్రామానికి చెందిన నైతం పగ్గు (55) అనే వ్యక్తి వ్యవసాయ కూలి పని కోసం రుయాడి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. నడింపల్లి గ్రామానికి చెందిన అతడి బామ్మర్దులు ఆత్రం భగవాన్లు, ఆత్రం రాములు బుధవారం ఉదయం పగ్గు ఇంటికి వెళ్లారు. అక్కడ బావతో కలిసి బయటికి వెళ్లి మద్యం సేవించారు. ఈ క్రమంలో కుల దేవార్ల పండగల విషయంలో పగ్గు చందా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అక్కడ మాట మాట పెరగడంతో పగ్గుపై బామ్మర్దులు దాడి చేశారు. ఈ క్రమంలో రుయాడి మెయిన్ రోడ్ లోని మురికి కాలువలో పడేసి కొట్టారు. దీంతో పగ్గుకు నుదుటిపై తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్, తలమడుగు ఎస్ఐ రాధిక మృతదేహాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి కూతురు మడవి భీంబాయ్ ఫిర్యాదు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా బావను హతమార్చిన బామ్మర్దులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

బోథ్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పాఠశాలలో బంద్ విజయవంతమైంది. బంద్‌కు సహకరించాలని ముందుగానే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడంతో స్థానిక విద్యార్థి సంఘం నాయకులు బంద్ చేపట్టాలని సూచించారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు కొన్ని మూసి ఉంచారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఇచ్చారు. డిమాండ్లతో కూడిన బంద్ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు మున్సిఫ్ నరేష్, కార్తీక్, నిఖిల్, ముఖం నితీష్, సాయి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వీ. మహేంధర్ అన్నారు. బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బంద్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కుంటాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తరగతులను బహిష్కరించారు.

ముథోల్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఏబీవీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పరమేష్ బుధవారం పేర్కొన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపుపై విద్యాసంస్థల బంద్‌ను ముథోల్, భైంసాలో విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వాకుమారి మహేందర్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్, ఏబీవీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కిరణ్, ఉదయ్, ఏబీవీఎస్ జిల్లా నాయకులు లంబాడి రాజారామ్, టి. నితిన్, రుద్ర ప్రతాప్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి'

ఉట్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తర్వాత నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలువస్తాయని భావిస్తే గత ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వక పోవడం వల్లనే తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరిగిందని, ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్‌పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉట్నూర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రంసుగుణ తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలోని పేరుక గూడెం సమీపంలో ఉన్న జేసీఎస్ ఫంక్షన్ హాల్‌లో 25న ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాకు రాష్ట్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హాజరై ప్రారంభిస్తారన్నారు. ఇందులో మాజీ సర్పంచ్ జాదవ్‌సునిల్, తిత్రేగోవింద్, వినోద్, బుచ్చన్న, రాథోడ్‌అన్వేష్, రాజవ్వ, అన్నపూర్ణ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

● 'జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి'

మావల: ఈనెల 25వ తేదీన ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆత్రం సుగుణక్క, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డిలు కోరారు. ఆదిలాబాద్ నిరుద్యోగులకు ఉద్యోగాకాశాలు కల్పించే దిశగా టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని శ్రీకాంత్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇందులో పార్టీ ముఖ్య నేతలు, యువజన కాంగ్రెస్, కిసాన్ కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, ఎన్‌ఎస్‌యూఐ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'

ఉట్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని యూఎస్‌పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్‌పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు దశలో పోరాటంలో భాగంగా మొదటి విడతగా విద్యరంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఉట్నూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇందులో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్, టీజీటీటీఫ్ నాయకులు ఎస్వామి, ఆత్రం భుజంగరావు, వీరయ్య, ఆత్రంజంగు, రవీందర్‌చౌహాన్, దేవిదాస్, జాదవ్ రవీందర్, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

'సొంత భవనాలకు కృషి చేయండి'

తలమడుగు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకురాలు కాటిపల్లి సునీత రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎంతో మంది ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటి వరకు వారికి అందడం లేదన్నారు. అదేవిధంగా గ్రామాల్లో కొంతమంది మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి ఇంతవరకు డబ్బులు అందలేదని, త్వరగా డబ్బులు అందేలా చూడాలని అన్నారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంపీవో వినోద్, తదితరులు ఉన్నారు.

'వితంతు పెన్షన్‌లు విడుదల చేయాలి'

నేరడిగొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న వితంతు పెన్షన్ వెంటనే విడుదల చేయాలని లైవ్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ అన్నారు. పలుమార్లు దరఖాస్తులు ఇచ్చిన ఈ దరఖాస్తులపై ఎటువంటి చర్యలు లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. నిరుపేద కుటుంబాలలో ఇంటి యజమాని భర్త అకాల మరణం కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుందని, కుటుంబపెద్ద చనిపోతే మహిళపై ఆర్థికభారం పెరిగిపోతుందన్నారు. అలాంటి మహిళలకు వితంతు పెన్షన్ అండగా నిలుస్తుంది. కాబట్టి వెంటనే వితంతు పింఛన్లు అందించి నిరుపేద మహిళా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు.

నందిగామ శివాలయంలో పూజలు

తలమడుగు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అతి పురాతనమైన నందిగామ శివాలయంలో బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శివోహం ఆధ్యాత్మిక భక్త బృందం ఆధ్వర్యంలో మాస శివరాత్రి అమావాస్య సందర్భంగా ఆలయంలో వేద పండితులతో గణపతి పూజ, ప్రత్యేక శివలింగ అభిషేకం, హారతి కార్యక్రమాలను భక్తి ప్రపత్తుల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రవీణ్ శర్మ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కేదారేశ్వర రెడ్డి, శివోహం భక్త బృందం అధ్యక్షులు సతీష్ దేశ్పాండే, భాస్కర్ రెడ్డి, శంకర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, వేద పండితులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల ప్రాజెక్టుపై అవగాహన

ఉట్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరిపై నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు కట్టడంపై విద్యార్థులకు తెలంగాణకు జరిగే నష్టంపై అవగాహన కల్పిస్తున్నామని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భుక్యజాన్సన్ నాయక్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ల ఆదేశాల మేరకు బనకచర్ల ప్రాజెక్టు అక్రమాల గురించి విద్యార్థులకు వివరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ధరణి రాజేశ్ మాట్లాడారు. బాబాశ్యామ్, సాజిద్‌సిద్దిక్, కోటేశ్, బొడ్డునరేష్; మరికంటి కిరణ్ తదితరులున్నారు.

'గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి'

ఉట్నూర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఖానాపూర్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆత్రం రాహుల్, ఉట్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఆత్రం తిరుపతి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బానోత్ జైవంతరావులు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జీవో 49 రద్దు కోసం ఉదయం నుంచి రాత్రి వరకు హైదరాబాద్‌లోని కార్యాలయాల చుట్టు తిరిగి మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి జీవో 49 రద్దు చేయించడానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ రాత్రి పగలు కష్టపడ్డారని అన్నారు. మంత్రి సీతక్కతో పాటు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సోయంబాపురావు, ఆత్రంసక్కులతో కలిసి జీవో 49 రద్దు చేయించడానికి ముఖ్యమంత్రిని కలిశారన్నారు. గత ప్రభుత్వ హాయంలోనే జీవో 49 తయారైందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీర ఎండు పార్టీలు గిరిజనులకు అన్యాయం చేయడానికి కృషి చేస్తునే ఉంటాయన్నారు. ఇందులో కొట్నాక్ ఉమేష్, వెడ్మకొద్దుపటేల్, ఆత్రం మోతిరాం, మేస్రం భాగ్యలక్ష్మి, సిడాంకౌసల్య, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మాటలు నమ్మొద్దు

● బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం

తలమడుగు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఓట్ల కోసం వచ్చే బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల నాయకుల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యనిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలో నాయకులకు పదవులు తప్ప ప్రజా సమస్యలు పట్టవన్నారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కాలం చెల్లిన పార్టీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక ఎంపీ స్థానం కూడా గెలవలేదన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాలలో ఎన్నికలలో బీజేపీ విజయావకాశాల ఎక్కువగా ఉన్నాయని, అందరూ సమన్వయంతో సమష్టి కృషితో విజయం సాధిస్తామని తెలిపారు. ఇందులో తలమడుగు మండల అధ్యక్షుడు నక్క ధనుంజయ్, సీనియర్ నాయకులు చంద్రకాంత్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎన్నికల ఎన్నికల ప్రబారి డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షుడు తహారే రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భీంరెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్, సునీల్, భరత్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి మండల కన్వీనర్ బోరే రవీందర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఆ పార్టీ జిల్లా నాయకులు దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సభ్యులు జీవీ రమణ పాల్గొని కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రబారి రంజిత్‌సింగ్‌తో పాటు పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బోయిన్ వాడ్ అమోల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బోయిన్ వాడ్ అమోల్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల కోసం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా కదం బాబురావ్ హాజరై మాట్లాడారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు ఆమ్టే, మాజీ ఎంపీపీ అమృత రావు, మాజీ కోఆప్షన్ సభ్యులు మాణిక్ రావు, గోర్బండ్ బాలాజీ, విలాస్, నాందేవ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్: బీజేపీ స్థానిక ఎన్నికల కార్యశాల కార్యక్రమం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు పాయల శరత్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో కార్యకర్తలందరు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. బీజేపీ నాయకులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): రాబోయే మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జడ్పీటీసీ) ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) విజయం సాధించడం కోసం ప్రతీ కార్యకర్త కలిసిమెలిసి పని చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం నందు బుధవారం బీజేపీ మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సామ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడారు.

మందుపై.. ముందుచూపు!

(5వ పేజీ తరువాయి...)

మీరుతున్న దేశీదారు మద్యం విక్రయాలు ఎక్సైజ్ శాఖాధికారులకు సవాల్‌గా మారింది. త్వరలోనే రిజర్వేషన్లు ఖరారయ్యే అవకాశం ఉండడంతో గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి కనిపిస్తుంది. అదేవిధంగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న వారంతా ఓటర్లను ఆకట్టుకునేందుకు ముందస్తుగా మందు, విందు పార్టీలను కూడా ఏర్పాటు చేస్తూ మద్దతును కూడగడుతున్నారు.

సమాచారం ఇస్తేనే హడావిడి

దేశీదారు మద్యం విక్రయాలపై సమాచారం ఇస్తేనే ఎక్సైజ్ శాఖ అధికారులు హడావిడి చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. బెల్ట్‌షాపులపై పోలీసులే తరుచూ దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తయిన చూడడం లేదంటున్నారు. బెల్ట్‌దందా చాటునా దేశీదారు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మహారాష్ట్ర మద్యం తక్కువ ధరకు దొరకడంతో మందుబాబులు కూడా దేశీదారు మద్యం వైపే మొగ్గుచూపుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఒక్కో వ్యాపారి రెండు, మూడు సార్లు దేశీదారు మద్యాన్ని విక్రయిస్తూ పట్టుబడుతున్న అధికారులు కఠినంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు నిఘా సారించినట్లు కనిపించడం లేదు. బోథ్ మండలం ఘన్‌పూర్, తలమడుగు మండలం లక్ష్మీపూర్, బేల మండలం శంకర్‌గూడ, జైనథ్ మండలం బోరజ్ చెక్‌పోస్టులపై నిఘా కరువవుతుందన్న విమర్శలు వస్తున్నాయి. చెక్‌పోస్టు సిబ్బంది తో మద్యం వ్యాపారులు కుమ్మకవుతున్నట్లు తెలుస్తుంది. అలాగే అడ్డదారుల్లో అక్రమ మద్యాన్ని తరలిస్తూ అమ్మేసుకోవడం పరిపాటిగా మారింది.

'పాత గ్రామ పంచాయతీ భవనంలో ఎరువుల బస్తాలను తొలగించాలి'

బోథ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఉన్న పాత గ్రామపంచాయతీ భవనంలో కొంతమంది రైతులు ఎరువుల బస్తాలు వేయడంతో గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం పాత గ్రామపంచాయతీ భవనంలోని సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది రైతులు కావాలని చెరువుల బస్తాలు వేస్తున్నారని కోరుకుంటున్నారు. దీంతో ఇబ్బందులు కలుగుతున్నాయని అంటున్నారు. గ్రామ పెద్దలు ఈ విషయంలో జోక్యం చేసుకుని ఎరువుల బస్తాలు వేయకుండా చూడాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కుంటాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓలా-కుంటాల రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రం కుంటాలకు చెందిన వేముల రాము(22) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్సై అశోక్ కథనం మేరకు రాము ఓలా నుంచి కుంటాలకు ద్విచక్రవాహనంపై అతి వేగంగా, అజాగ్రత్తగా రావడం వలన ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి గమనించిన స్థానికులు అతనిని 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుంటాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామంలో బుధవారం పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకొని రూ.6,900 స్వాధీనపరుచుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని కల్లూరు బస్టాండ్ సమీపంలో ఓ షెడ్డులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మహిళా శక్తిలో భాగంగా మహిళా కానిస్టేబుళ్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధి కోసం వెళ్లి అనంత లోకాలకు..

దస్తురాబాద్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం కుటుంబ భారాన్ని భుజాలపై వేసుకొని వలస వెళ్లిన ఓ యువకుడు తిరిగి రాని లోకాలకు వెళ్లిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మున్యాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన సంగ సురేష్ యాదవ్(35) అనే యువకుడు ఉపాధి నిమిత్తం ఉబ్బెకిస్తాన్ దేశానికి వలస వెళ్లాడు. అక్కడ ఓ సంస్థలో పని చేస్తున్న సురేష్ ఛాతీలో నొప్పి వస్తోందని స్నేహితులకు తెలిపాడు. మరుసటి రోజు హాస్పిటల్‌కు వెళ్లే క్రమంలో గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మృతదేహం తెచ్చేందుకు చొరవ చూపాలని కోరారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

'ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలి'

బాసర, జూలై 23(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో అజాగ్రత్తగా ఆటో నడిపి యువకుడి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌ను కఠినంగి శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బాసరలో నిరసన చేపట్టారు. బాసరకు చెందిన ఆలెగం కార్తీక్‌రావు అనే యువకుడు ఈనెల 3న సాయంత్రం వాకింగ్ చేస్తూండగా వెనుక నుంచి గ్రామానికి చెందిన బెల్దారి నర్సయ్య ఆటోతో ఢీకొట్టగా తలకు తీవ్ర గాయమైన ఇటివలే మృతి చెందాడు. ప్రాణాలు పోయినా.. ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు ఈ మేరకు ధర్నాకు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు వేంటనే పరారీలో ఉన్న ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

'మహాగర్జనకు సన్నద్ధం కావాలి'

నేరేడిగొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): 13న హైదరాబాద్‌లో జరగబోయే చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనకు సన్నద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్, ప్రేమ్‌రాజ్‌లు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ చేయూత, బడీ, గీత, నేత కార్మికులు పెన్షన్‌తో పాటు వృద్ధుల వితంతువుల, వికలాంగుల ఒంటరి మహిళల పెన్షన్ ఇవ్వాలని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఆగస్టు 13న నిర్వహించ తలపెట్టారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గజ్జల శంకర్ మాదిగ, గోనే అడేళ్ళు, కనక కిషన్, షేక్ మొహీనుద్దీన్, సింగరపు లస్మన్న, తదితరులు ఉన్నారు.

'పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం'

కుంటాల, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పీఆర్‌టీయూ మాత్రమే పరిష్కరిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణ రావు పేర్కొన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 010 ద్వారా వేతనాలు, జేఎల్ పోస్టు క్రియేట్ చేసి పీజీటీలకు ప్రమోషన్ ఇవ్వాలని, కారుణ్య నియమాకాలు చేపట్టాలని, హెల్త్ కార్డులు అందజేయాలని, సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, కొత్త రిక్రూట్‌మెంట్ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలన్నారు.

'సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందాలి'

తలమడుగు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రతీఒక్కరికి అదేవిధంగా కృషి చేయాలని ఎంపీడీవో శంకర్ కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో అయినా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీఒక్కరికి అందించాలని సూచించారు. అదేవిధంగా వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా త్వరలో జరగబోయే పంచాయతీ ఎన్నికలకు ఓటరు జాబితా . పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించి గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఇందులో ఎంపీవో వినోద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తలమడుగు ఎంపీడీవో శంకర్



తాళికట్టు.. శ్రావణ వేళ..



- రేపటి నుంచి శుభకార్యాల మాసం ప్రారంభం
- 26 నుంచి వివాహ ముహూర్తాలు
- నెల రోజుల పాటు లగ్గాలు
- ఆగస్టు, నవంబరు దాటితే మళ్లీ 2026 ఫిబ్రవరిలోనే..
- సందడిగా మారనున్న కల్యాణ మండపాలు
- బిజీ బిజీగా పురోహితులు, క్యాటరింగ్ సెంటర్లు
- జిల్లా వ్యాప్తంగా వందలాది పెళ్లిళ్లు

- భైంసా (ఆంధ్రజ్యోతి)

శ్రావణ మాసంలో పెళ్లి సందళ్లు మొదలు కాబోతున్నాయి. కల్యాణం, కమనీయం అంటూ వాట్సాప్‌లో స్టేటస్‌లు మోగిపోనున్నాయి. బంధుమిత్రుల సమక్షంలో రెండు మనసులు మూడు ముళ్ల బంధంతో ఒక్కటి కాబోతున్నాయి. ప్రతీ వాడలో వివాహ సందడి మొదలు కానుంది. దాదాపు రెండు నెలల తర్వాత లగ్గాలు షురూ కానున్నాయి. హిందూ సంప్రదాయం ప్రకారం మంచి ముహూర్తంలో వివాహం చేస్తుంటారు. దానికి మంచి రోజు, తేదీ చూడటం ఆచారం. అయితే చాలా రోజుల నుంచి వివాహాలకు శుభ ముహూర్తాలు లేవు. అయితే శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే శ్రావణంలో వివా హాది శుభకార్యాలకు మంచి రోజులు వచ్చాయని పండితులు చెబుతున్నారు. ఈనెల 25వ తేదీ నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండగా, 27వ తేదీ నుంచి అగస్టు 30 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. మళ్లీ కార్తీక మాసంమలోనే వివాహ ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు.

నెలరోజుల పాటు శుభముహూర్తాలు ఇలా..

శ్రావణమాసం.. మంచి రోజులకు అనువైన కాలం. ఈ నెల 26, 30, 31, ఆగస్టు 1, 3, 4, 6, 10, 13, 15, 17, 18 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉండడంతో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వందల జంటలు కానున్నాయి. ఇవే కాకుండా ఇల్లే దేవాలయంగా భావించి నోములు, వ్రతాలు, మంగళగౌరీ, వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తారు. గృహ ప్రవేశాలకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆగస్టు 24 నుంచి భాద్రపద మాసం ప్రారంభం కానుంది. ఈ నెలలో శుభాకార్యాలు నిర్వహించరు. పెళ్లిళ్ల సీజన్ ఉండటంతో అంతా సందడిగా మారనుంది. పెళ్లిళ్ల సీజన్ రావడంతో అనుబంధంగా ఉండే వ్యాపారాలు జోరందుకోనున్నాయి. పురోహితులే ముహూర్తాలు ఖరారు చేయడంతో.. ముఖ్యమైన రోజుల్లో వారి తేదీలు ఖాళీలు లేవు. ఇప్పటికే పూల పందిళ్లు, డెకరేషన్ చేసే వారికి, సౌండ్ బాక్స్, డీజే, టెంట్ హౌజ్ నిర్వాహకులకు డిమాండ్ పెరగనుంది.



లో లెవల్ వంతెనలు..
హై లెవల్ కష్టాలు

- ఏడు దశాబ్దాలు దాటినా ఇంకా మారని మారుమూల గిరిజన గ్రామాల రోడ్ల పరిస్థితి
- కొట్టుకుపోయినా పట్టించుకోని అధికారులు

ఉట్నూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు లో లెవల్ వంతెనలతో ఇబ్బందులు పడుతునే ఉన్నారు. ఉట్నూర్ మండలంలోని షాంపూర్ ఆర్అండ్‌వి రహదారి నుంచి తాండ్రవొల్వాడి, బాబాపూర్ తదితర గ్రామాలకు వెళ్లే రహదారిపై సుంగాపూర్ కొలాంగూడ సమీపంలో



పిట్లగూడెం వద్ద ఉన్న లోలెవల్ వంతెన

చిన్నపాటి వాగుపై లోలెవల్ వంతెన నిర్మించారు. వర్షాకాలంలో ఈ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. లోలెవల్ వంతెన దాటి అరకిలో మీటర్ ప్రయాణిస్తే ప్రధాన రహదారికి ప్ర జలు చేరుకునే అవకాశం ఉంది. కాని వర్షాకాలంలో వరద నీరు వంతెన పై నుంచి ప్రవహిస్తే తిరిగి ఆరు ఏడు కి.మీ. ప్రయాణించి కుమ్మరితండా సమీపం నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు ద్వారా షాంపూర్, ఉట్నూర్ చేరుకోవాల్సి వస్తుందని గ్రామీణ ప్రాంతాల ప్రజలు అంటున్నారు. ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ గ్రామానికి వెళ్లే దారిలో మత్తడిగూడకు, శంభు మత్తడిగూడకు మధ్యలో లోలెవల్ వంతెన దశాబ్దాల క్రితమే నిర్మించింది ఉం ది. శంభు మత్తడి గూడ ఏర్పాటుకాక ముందు మత్తడిగూడలో పాఠశాల మండల పరిషత్ అధికారులు ఏర్పాటు చేశారు. శంభు మత్తడిగూడకు చెందిన విద్యార్థులతో పాటు ఉట్నూర్ నుంచి వెళ్లే ఉపాధ్యాయులు ఈ లోలెవల్ వంతెన దాటి వెళ్లాల్సి వస్తుంది. జోరుగా వర్షం కురిస్తే వరద ప్రవాహం తగ్గే వరకు పిల్లలు ఉపాధ్యాయులు ఆగిపోవాల్సి వస్తుంది. వీరితో పాటు ఏదైనా అత్యవసరానికి వెళ్లాల్సిన అవసరం వస్తే మత్తడిగూడ గ్రామాల ప్రజలతో పాటు





మత్తడిగూడ, సుంగుగూడ వద్ద ఉన్న లోలెవల్ వంతెన

రాంపూర్ గ్రామస్థులు సైతం ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరికి ప్రత్యామ్నాయ దారి లేక పోవడంతో లోలెవల్ వంతెనలో ఎప్పుడు నీటి ప్రవాహం తగ్గితే అప్పుడే వారు గ్రామం నుంచి బయటకు వెళ్లే అవకాశం ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

వంతెన కొట్టుకు పోయినా పట్టించుకోరు

ఇదే తరహాలో మండలంలోని కొమురంభీం ప్రాంగణం సమీపం నుంచి దేవగూడ మీదుగా పిట్లగూడ వెళ్లే దారిపై ఉన్న లోలెవల్ వంతెనతో ప్ర జలు ప్రతియేటా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నాగాపూర్ పంచాయతీ పరిధిలో ఉండగా అప్పటి స్థానిక ప్రజా ప్రతినిధులు మరమ్మతులు చేయించగా తేలికపాటి వర్షాలకి కొట్టుకుపోయింది. లింగోజితండా గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చాక ఈ వంతెనకు మరమ్మతు లు చేసిన అదే పరిస్థితి పురాణవృతం అయింది. ప్రస్తుతం ఈపిట్లగూడ గ్రామం మరోసారి టక్కుగూడ పంచాయతీ పరిధిలోకి చేరింది.గత సంవత్సరం కురిసిన భారీ వర్షానికి లోలెవల్ వంతెనగ ఉన్న పిట్లగూడ వంతెన అప్రోచ్ రోడ్డుతో పాటు వంతెనపై ఉన్న సిమెంట్ కొట్టుకు పో యింది. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులు మొరం పోసి తాత్కాలిక మరమ్మతులు చేయగా ఇటీవల కురిసిన వర్షాలకుపైన వేసిన మొరం కొట్టుక పోయింది. ఈ లోలెవల్ వంతెనపై వరద నీరు పారితే తాము టక్కుగూడ పెరగూడెం మీదుగా ఆర్అండ్‌బీ ప్రధాన రహదారికి చేరుకొని ఉట్నూర్ వైపు కాని ఆదిలాబాద్ వైపు కాని వెళ్లాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని కన్నాపూర్ రోడ్డుపై ఉన్న లోలెవల్ వంతెనతో ఉమాపతి కుంట, రాజులమడుగు, కన్నాపూర్ ప్రాంతాల ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు.చాందూరి గ్రామ సమీపంలో ఉన్న లోలెవల్ వంతెనతో కూడా వర్షం కురిసినప్పుడు వాగురాక పోకలు నిలిచి పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు లోలెవల్ వంతెనలపై కొత్త వంతెనలు నిర్మించి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వాలు విఫలం

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర క న్వీనర్ డాక్టర్ విశారదన్



నర్సాపూర్(జి) జడ్పీ పాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న దృశ్యం

నర్సాపూర్(జి), జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పడిన తర్వాత నాటి టీఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో పూర్తిగా విఫలమయ్యాయని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం నర్సాపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను, 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉందని అన్నారు. ఆస్పత్రిలో మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఒక్క వైద్యుడు కూడా అందుబాటులో లేకపోవడంపై ఆయన మండిపడ్డారు. డ్యూటీ డాక్టర్లు వచ్చే వరకు అక్కడే కూర్చుని నిరసన తెలిపారు.

గాజులపేట్‌లో వైద్య శిబిరం

నిర్మల్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గాజులపేట్‌లో వైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ తేజస్విని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాలానుగుణంగా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి మంగళ, శుక్ర వారం డ్రై డే పాటించాలని తెలిపారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తీసుకోకూడదని తెలియజేశారు.



సంత్ నాందేవ్ మహరాజ్ చిత్ర పటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో సంత్ శిరోమణి నాందేవ్ మహరాజ్ పుణ్యతిథి వేడుకలు

భైంసా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పురాణబజార్ ప్రాంతంలో గల మేరు సంఘ భవనంలో బుధవారం సంత్ శిరోమణి నాందేవ్ మహరాజ్ పుణ్యతిథి వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. భైంసా మేరు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పట్టణ పరిధిలోని మేరు కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సంత్ శిరోమణి నాందేవ్ మహరాజ్ చిత్ర పటానికి శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ సభ్యుల ఆధ్వర్యంలో భజన, అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భైంసా మేరు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరికొండ గంగాధర్, కొట్బూర్ సాయినాథ్, కోశాధికారి గందేవార్ సాయినాథ్‌లు సంత్ శిరోమణి నాందేవ్ మహరాజ్ చేసిన సేవలను వివరించారు.

ఖండాల జలపాతంలో పడి ఒకరి గల్లంతు



మనోహర్ సింగ్(ఫైల్)

ఆదిలాబాద్ రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల జలపాతంలో ప్రమాదవశాత్తు పడి ఒకరు గల్లంతైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖండాల జలపాతనికి ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన మనోహర్ సింగ్ (17) తన స్నేహితులతో కలిసి వచ్చాడు. ప్రమాద వషత్తు జలపాతంలో పడి గల్లంతయ్యారు. మనోహర్ సింగ్ తండ్రి దుంగల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'పొచ్చెర' అచ్చెరువొందేలా..

- అటవీ శాఖ అధికారులకు బోటింగ్‌లో శిక్షణ

బోథ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతం సమీపంలో ఉన్న చెక్ డ్యామ్‌లో స్థానిక అటవీ శాఖ అధికారులకు బుధవారం బోటింగ్ పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎక్కువ నీరు వచ్చినప్పుడు ఏ విధంగా ఓటింగ్ ద్వారా ప్రజలను ఆదుకోవచ్చు అనే అంశంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. కర్ణాటకకు చెందిన ప్రత్యేక బృందం అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ రేంజి అధికారి, ఇంద్రవెల్లి రేంజ్ అధికారి సంతోష్‌లతో పాటు డిప్యూటీ రేంజ్ అధికారి నాగోరావ్ సిబ్బంది పాల్గొన్నారు.



కర్ణాటక బృందం వారిచే శిక్షణ పొందుతున్న అటవీశాఖ అధికారులు

రాళ్లను దాటితేనే వైద్యం

బజార్‌హత్నూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం సరిగా లేక వైద్య సిబ్బంది తప్పని పరిస్థితిలో బురద, రాళ్లదారిలో వెళ్లి వైద్యం అందిస్తున్నారు. ప్రతీ బుధవారం, శనివారాల్లో మారుమూల గ్రామాల్లో చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలతో పాటు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. సంబంధిత ఏఎన్ఎం ఆశా కార్యకర్తలతో కలిసి బృందులను ఎదుర్కొంటునే వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా బుధవారం టెంబి గ్రామం నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న చిన్నుమియా తండాకు రాళ్లను దాటుతూ వైద్య సిబ్బంది వెళ్లి పిల్లలకు టీకాలు అందించారు.



చిన్నుమియా తండాకు రాళ్లదారిలో వెళ్తున్న వైద్యసిబ్బంది

కావ్య @ ఒక్కరోజు శాస్త్రవేత్త

మామడ, జూలై 23 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు పాఠశాలల్లో చదువుతున్న ప్పుడు ఉపాధ్యాయుల ప్రేరణతో ఏదో ఒక రంగంలో స్థిరపడాలని కలలు కంటున్నారు. శాస్త్రవేత్త కావాలని సైన్స్ పట్ల ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరికి అలాంటి అభిరుచి ఉంటుంది. ఒక్కరోజు శాస్త్ర వేత్తగా ఉండడానికి మేకల కావ్యకు ఆ అవకాశం వచ్చింది. మామడ మండలంలోని పొన్కల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కావ్యకు సీఎస్ఐఆర్ సీసీఎంబీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఒక్కరోజు శాస్త్ర వేత్తగా ఏమేం చేయాలో పరిశీలించ డానికి తన సైన్స్ టీచర్ విజయలక్ష్మీతో హైదరాబాద్‌కి వెళ్లింది మేకల కావ్య. ఇంకేముంది తన ఆనందానికి అ వధులు లేవు. భవిష్యత్తులో తాను శా స్త్రవేత్త కావాలనుకుం టున్న దానికి తక్కువ సమయంలోనే అది నిర్మల్ జిల్లా నుంచి తనకొక్కరికే అంతటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థను సందర్శించే అవకాశం వచ్చింది. అన్ని అంశా లను పరి శీలించింది. తన కోరికను మరింతగా ప దిలపరుచుకుంది.



పొన్కల్ విద్యార్థిని కావ్యతో సైన్స్ టీచర్

'జీవో 49ని రద్దు చేయాలి'

ఉట్నూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆదివాసులను మభ్యపెట్టడానికి జీవో 49 తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం సరైంది కాదని, ఈజవో 49ని పూర్తిగా రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉట్నూర్ ప్రెస్‌భవన్ ఆవరణలో బుధవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పురకబాపురావు, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందూరుదాదిరావు, ఆదివాసీ అడ్వకేట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూరు ప్రభాకర్, తుడుందెబ్బ జిల్లా గౌరవ అధ్యక్షుడు పంద్రజైవంత్‌రావు, ఆడ హనుమంతరావు తదితరులు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఉమ్మడి జిల్లా బంద్‌కు పిలుపునిచ్చి జీవో 49 రద్దు చేయాలంటూ డిమాండ్ చేయడంతో జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జీవో 49 తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటింప చేశారన్నారు.



డ్రైనేజీ లేక రోడ్డు పక్కన

అమాత్యా.. ఏమిటీ అవస్థ

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని దస్నాపూర్ పాత జాతీయ రహదారి నుంచి కేఆర్‌కే కాలనీ వరకు రూ.2.10 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి హోదాలో సీతక్క భూమిపూజ చేశారు. ఆరు నెలలు గడిచినప్పటికీ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. కాంట్రాక్టర్ పనులు పూర్తి అలసత్వం ప్రదర్శించడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు అంతా బురదమయంగా మారి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

వర్షం పడితే ఉండేదెలా..?



హాస్టల్ గదిలో పై భాగం నుంచి లీక్ అవుతున్న నీరు




హాస్టల్ గదిలో నిలిచిన నీరు

● **హాస్టల్ ఖాళీ చేస్తున్న విద్యార్థులు**

బోథ్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా (బి) బీసీ బాలుర వసతి గృహంలో వర్షాకాలం వచ్చిందంటే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ హాస్టల్ పై భాగంలో పగులు తేలడంతో వర్షాలకు మీరు కిందికి లీక్ అవుతుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. హాస్టల్ పైభాగంలో మరమ్మతులు చేయకపోతే విద్యార్థులు హాస్టల్లో ఉండేందుకు రాత్రిపూట పడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

● **ఇంటిదారి పడుతున్న విద్యార్థులు**

హాస్టల్లో రాత్రిపూట పడుకునేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండడంతో విద్యార్థులు హాస్టల్లో ఉండేందుకు ఇష్టపడడం లేదు. దీంతో ఇప్పటికే కొంతమంది విద్యార్థులు హాస్టల్ నుండి వెళ్ళిపోతున్నారు. గ్రామంలో పాఠశాల బాగానే ఉన్నా హాస్టల్లో సరైన వసతి లేక వెళ్ళిపోతున్నారు. అధికారులు ఈ విషయంలో దృష్టి సాధించాల్సి ఉంది. అధికారులకు వివరించాం. హాస్టల్లో విద్యార్థులు పట్టుకొని ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చామని హాస్టల్ వార్డెన్ తెలిపారు. విద్యార్థులు భోజనం చేసేందుకు గది బాగానే ఉన్నా పడుకునేందుకు రాత్రిపూట ఇబ్బందుల గురవుతున్నారు. ఫలితంగా కొంతమంది విద్యార్థులు వేరే పాఠశాలకు వెళ్తామన్నారు. హాస్టల్ బాగుచేస్తే విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు పేద విద్యార్థుల ఇబ్బందులు తొలిగే ఆస్కారం ఉంది.



అమ్మవారి హుండీ లెక్కింపు

బాసర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి హుండీ కానుకలను బుధవారం లెక్కించారు.ఉదయం ప్రారంభమైన లెక్కింపు దినమంతా కొనసాగింది. ఈ లెక్కింపులో రూ89,79,396 నగదు, మిశ్రమ బంగారం 85 గ్రాము లు, మిశ్రమ వెండి 4 కిలోల 700 గ్రాములు కానుకలతో పాటు వివిధ దేశాలకు చెందిన 25 కరెన్సీలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆదాయం మొత్తం 58 రోజుల్లో ఆలయానికి సమాకూరినట్లు అధికారులు చెప్పారు. ఆలయ ఈఓ సుధాకర్ రెడ్డి, ఏఈఓ సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.



హైవే రోడ్డు



బాసర వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం పనులు

- బీబీ రోడ్డుతో కొత్త లింకేజీ
- మహారాష్ట్రకు పెరగనున్న రవాణా విస్తరణ
- ఎన్‌హెచ్ 61 విస్తరణతో పెరగనున్న రోడ్డు సౌకర్యం
- వ్యాపార వాణిజ్య రంగాల అభివృద్ధికి మార్గం సుగమం

సరిహద్దుల అనుసంధానం

నిర్మల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాకు మహారాష్ట్రతో మరో రోడ్డు లింకేజీ ఏర్పడబోతోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి నేషనల్ హైవే నెంబర్ 161 రోడ్డు జిల్లాలోని బాసర మీదుగా భైంసా వరకు విస్తరించనుంది. ఇప్పటికే చేపట్టిన ఈ హైవే రోడ్డు నిర్మాణ పనులు కొద్ది రోజుల్లోనే పూర్తి కానున్నాయి. బోధన్, మద్నూర్ నుంచి భైంసా వరకు మొత్తం 56 కిలో మీటర్ల పొడవుతో ఈ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రెండు వరుసలుగా నిర్మిస్తున్న ఈ రోడ్డు కోసం రూ. 644.45 కోట్లను వ్యయం చేయనున్నారు. ప్రస్తుతం నేషనల్ హైవే అధికారులు ఈ రోడ్డును ఎన్‌హెచ్ 161 బీబీ రోడ్డుగా పిలుస్తున్నారు. ఈ హైవే నిర్మాణంలో భాగంగానే బాసర గోదావరిపై మరో బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా చేపట్టారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జి పనులు కూడా పూర్తయ్యే దశలో ఉన్నాయి. ఈ రోడ్డు నిర్మాణంతో మహారాష్ట్రతో రవాణా రంగంకు మరింత ఊతం లభిస్తుందంటున్నారు. ఇప్పటికే మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి భైంసా మీదుగా నిర్మల్, ఖానాపూర్ వరకు నేషనల్ హైవే నెంబర్ 61 కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ రోడ్డుకు తోడుగా 161 బీబీ హైవే ఏర్పడబోతుండడంతో ఇక ఇరువైపులా హైవే మార్గం జిల్లాకు తోడు కానుంది. అలాగే తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, కర్ణాటక రాష్ట్రాలకు హైవేల లింకేజీ ఏర్పడబోతోంది.

విస్తరించనున్న వ్యాపార రంగం

ఇప్పటికే నిర్మల్ జిల్లా మీదుగా నేషనల్ హైవే నెంబర్ 44 నాగాపూర్, హైదరాబాద్ రోడ్డు వెళుతోంది. అలాగే మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి భైంసా, నిర్మల్ మీదుగా ఖానాపూర్ వరకు నేషనల్ హైవే నెంబర్ 61 రోడ్డు నిర్మాణం పూర్తయ్యాయి. ఈ రోడ్డును జగిత్యాల జిల్లా చల్‌గల్ వరకు విస్తరించి నిజామాబాద్ జగదల్‌పూర్ హైవేకు లింక్ చేయనున్నారు. కాగా ప్రస్తుతం నిర్మిస్తున్న నేషనల్ హైవే నెంబర్ 161 బీబీ రోడ్డు (బోధన్, బాసర, భైంసా)తో జిల్లాకు మూడు హైవేలు లింకులు కాబోతున్నాయి. దీంతో నాలుగు రాష్ట్రాల రోడ్డు మార్గం ఏర్పడబోతున్న కారణంగా జిల్లాలో వ్యాపార, వాణిజ్య రంగాలకు మరింత ఊతం లభిస్తుందంటున్నారు. ఇప్పటికే జిల్లాకు ఇటు హైదరాబాద్, నాగాపూర్‌ల నుంచి వ్యాపార లావాదేవీలు పెద్ద ఎత్తున కొనసాగుతుండగా నేషనల్ హైవే నెంబర్ 161తో పాటు కొత్తగా ఏర్పడబోతున్న ఎన్‌హెచ్ 61తో ఇటు నాందేడ్, లాతూర్, పర్బని, ఔరంగాబాద్ లాంటి ప్రాంతాలతో కూడా వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. కాగా బాసరకు రైల్వే లైన్ కూడా అందుబాటులో ఉన్న కారణంగా ఈ మార్గం ద్వారా కూడా వ్యాపార కార్యకలాపాలు ఇప్పటికే పెరిగిపోయాయి.

గోదావరిపై మరో బ్రిడ్జి

నేషనల్ హైవే నెంబర్ 161 బీబీ రోడ్డు నిర్మాణంలో భాగంగా బాసర వద్ద గల గోదావరి నదిపై మరో కొత్త బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దాదాపు 100 కోట్ల రూపాయల వ్యయంతో రెండు వరుసల బ్రిడ్జి నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జికి ఈ బ్రిడ్జి తోడు కానుంది. ముఖ్యంగా నిర్మల్, నిజామాబాద్ జిల్లాలను ఈ రెండు బ్రిడ్జిలు కలుపనున్నాయి. ప్రస్తుతమున్న బ్రిడ్జిపై వాహనాల రాకపోకల రద్దీ ఎక్కువ కావడంతో కొత్త బ్రిడ్జి కొంత మేరకు వాహనాల రద్దీ సమస్యను తగ్గించే అవకాశం ఉంటుంది. దీంతో గోదావరి బ్రిడ్జిపై ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరనుంది. వాహనాల రాకపోకలకు సౌకర్యం కూడా ఏర్పడబోతోంది.

90 శాతం పనులు పూర్తి అయ్యాయి

● ఆర్ఆర్ సుభాష్, డీఈ, నేషనల్ హైవే

బోధన్ టు భైంసా వయా బాసర మీదుగా వెళ్లే రోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం గోదావరి నదిపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గోదావరి నదిపై వంతెన నిర్మాణం కోసం 12 స్లాబులు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు ఎనిమిది పూర్తయినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పనులు పూర్తయితే రవాణా మార్గం మెరుగుపడుతుంది.

- బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంతో పెరిగిన ఆదాయం
- నష్టాలను అధిగమించి లాభాల బాటలోకి బస్సు డిపోలు
- జిల్లాలోని రెండు బస్సు డిపోల్లో 4.28 కోట్ల మహిళల ప్రయాణం
- రెండు డిపోల పరిధిలో ఘనంగా సంబురాలు



ఆర్టీసీని ఆమె.. నడిపిస్తోంది!

భైంసా, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కష్ట, నష్టాల బాటలో కొనసాగుతున్న ఆర్టీసీకి మహాలక్ష్మీ పథకంతో మంచి రోజులొచ్చాయి. బాలారిష్టాలతో కొనసాతున్న బస్సు డిపోలు నష్టాలను అధిగమించి లాభాల బాటలో ప్రయాణిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా 2023 డిసెంబరు 9 నుంచి పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ గణనీయంగా పెరిగింది. అన్ని డిపోల్లో బస్సులు 110కు పైగా ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) నమోదు చేసుకుంటున్నాయి. పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలోని నిర్మల్, భైంసా బస్సు డిపోల పరిధిలో 4.28 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాలు చేపట్టారు. మహిళల బస్సు ప్రయాణాల ద్వారా ఆర్టీసీకి మహాలక్ష్మి కళ సంతరించుకుంది. ప్రగతి రథ చక్రాలు పరుగులందుకున్నాయి. గతంలో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించే వారు సైతం ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల వైపు దారి మళ్లారు. పథకానికి ముందుకు 70 శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ రేషియో పథకం అమలయ్యాక 93 శాతానికి పెరిగింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 110 నుంచి 120 శాతానికి చేరుకుంది. మహిళలతో అన్ని రూట్లలోని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసి నడుస్తున్నాయి. ప్రభుత్వం ఉచిత బస్సు సొమ్మును ఆర్టీసీకి చెల్లిస్తుండడంతో సంస్థ ఆర్థిక లేమి నుంచి క్రమంగా బయటపడుతోంది.

జిల్లాలోని రెండు డిపో పరిధిలో 4.28 కోట్ల మంది మహిళల ప్రయాణాలు

జిల్లా పరిధిలో నిర్మల్, భైంసా కేంద్రాల్లో బస్సు డిపోలు ఉన్నాయి. నిర్మల్ డిపో పరిధిలో 73 పల్లె వెలుగు, 33 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉండగా వీటి ద్వారా మహాలక్ష్మీ పథకంలో 2.69 కోట్ల మంది మహిళలు రాకపోకలు చేపట్టారు. తద్వారా ఇక్కడి డిపోకు రూ.115 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఇక భైంసా డిపో పరిధిలో 28 పల్లె వెలుగు, 1 ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉండగా వీటిల్లో 1.59 కోట్ల మంది మహిళలు ప్రయాణాలు నిర్వహించారు. వీరి ద్వారా ఇక్కడి డిపోకు రూ.55 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

ఘనంగా సంబురాలు

మహాలక్ష్మీ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళా ప్రయాణికులు రాకపోకలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని రెండు బస్సు డిపోల పరిధిలో ఆర్టీసీ సంబరాలు నిర్వహించింది. భైంసా బస్టాండ్ ఆవరణలో డిపో మేనేజర్ హరిప్రసాద్ నేతృత్వంలో సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మహిళా ప్రయాణికులకు డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతుల పంపిణీని చేపట్టారు. ఇందులో డిపో సెక్యూరిటీ అధికారి బల్వంత్‌రావ్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



భైంసాలో మహిళా ప్రయాణికులను సన్మానిస్తున్న డిపో మేనేజర్ హరిప్రసాద్ తదితరులు

భైంసా సబ్ కలెక్టర్‌గా అజ్మీరా సాంకేత్



అజ్మీరా సాంకేత్

భైంసా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు రెవెన్యూ డివిజన్ కేంద్రాలకు సబ్‌కలెక్టర్ హోదాలో ఐఏఎస్ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందులో భైంసా సబ్‌కలెక్టర్‌గా 2023 ట్రేయిన్ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అజ్మీరా సాంకేత్‌కుమార్‌ను నియమింపబడ్డాడు. పరిపాలన సౌలభ్యం కోసం గాను 2024 జూన్‌మాసంలో రాష్ట్ర ప్రభుత్వం 15 రెవెన్యూ డివిజన్ కేంద్రాలను సబ్‌కలెక్టర్ హోదాను కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఉట్నూర్ (ఆదిలాబాద్), భైంసా (నిర్మల్), కాగజ్‌నగర్ (కుమురం భీమ్ ఆసిఫాబాద్) , బెల్లంపెల్లి (మంచిర్యాల్) రెవెన్యూ డివిజన్ కేంద్రాలున్నాయి, అయితే బుధవారం సబ్ కలెక్టర్లను నియమిస్తూ జారీ చేయబడిన ఉత్తర్వుల్లో భైంసాకు అజ్మీరా సాంకేత్ కుమార్, బెల్లంపెల్లికు మనోజ్‌లు నియమింపబడ్డారు కాగజ్‌నగర్, ఉట్నూర్‌కు ఇంకా సబ్ కలెక్టర్ల నియామకం జరుగలేదు. డివిజన్ పరిధిలో పాలన వ్యవస్థ మరింతగా మెరుగుకానుంది. గత సంవత్సరం జూన్‌మాసంలో భైంసా ఆర్‌డీవో కార్యాలయాన్ని సబ్‌కలెక్టర్ కార్యాలయంగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. అయితే ఇక్కడి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి ఐఏఎస్ అధికారిని నియమింపబడక పోవడం మూలంగా ఆర్‌డీవో సారథ్యంలోనే పాలన వ్యవస్థ కొనసాగింది. బుధవారం ప్రభుత్వం భైంసాకు సబ్‌కలెక్టర్‌గా అజ్మీరా సాంకేత్ కుమార్‌ను నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో సబ్‌కలెక్టర్ నేతృత్వంలో పాలన వ్యవస్థ మొదలుకానుంది. ఐఏఎస్ అధికారి సబ్ కలెక్టర్‌గా నియమింపబడిన నేపథ్యంలో డివిజన్ పరిధిలో ప్రభుత్వ పాలనపరమైన సేవలు సత్వరమే అందేందుకు వీలు ఏర్పడింది.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

● ఏఎస్పీ రాజేష్‌మీనన్



పోలీస్‌స్టేషన్‌లోని వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ

సారంగాపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏఎస్పీ రాజేష్‌మీనన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు. విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఆయనకు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. పోలీస్టేషన్‌లోని పరిసరాలను, వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి కేసుల వివరాలు, పోలీస్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లోని పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధి నిర్వహణలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డుల హిస్టరీ షీట్స్, మండల భౌగోళిక స్థితి, నేరాల నమోదు కేసుల స్థితిగతులు పారదర్శకంగా ఉండాలని సూచించారు. గ్రామాలలో పోలీసింగ్ ఉండాలని ప్రజలకు పోలీసు సేవలను వేగంగా అందించాలని సిబ్బందితో పేర్కొన్నారు. డయల్ 100కాల్స్‌పై సిబ్బంది తక్షణమే స్పందించాలని అన్నారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరగకుండా ప్రజలు సైబర్ మోసాలకు గురి కాకుండా గ్రామాలలో అవగాహన కల్పించి సైబర్ నేరాలకు మోస పోకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్‌లదేనని తెలిపారు. విధులు సక్రమంగా నిర్వహించిన సిబ్బందికి రివార్డులు, ప్రోత్సహకాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ఫిర్యాదులను తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. తనిఖీల కార్యక్రమంలో సీఐ. ఎం. కృష్ణ, ఎస్సై శ్రీకాంత్‌లున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


● వివరాలు వెల్లడించిన భైంసా ఏఎస్పీ అవినాష్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్‌లోని కుభీర్‌పోలీసుస్టేషన్ పరిధిలో గల చాత గ్రామంలో ఈ నెల 17న జరిగిన హత్యకేసును పోలీసులు ఛేదించారు. నిందితుడి వినియోగించిన రెండు కత్తులు, గొడ్డలి,మొబైల్ ఫోన్‌తో పాటు చోరీ చేసిన నగదు రూ.1.5 లక్షలను స్వాధీనపరుచుకొని రిమాండ్‌కు తరలించారు. బుధవారం భైంసా పట్టణ పోలీసుస్టేషన్‌లో సంబంధిత ఘటనపై భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ భైంసా టౌన్, రూరల్ సీఐలు గోపినాథ్, నైలు, కుభీర్ ఎస్‌ఐ కృష్ణరెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఇదివరకే నిజామాబాద్ జిల్లా బాల్కొండ ప్రాంతంలో ఒక హత్య కేసులో నిందితుడైన సిల్మల సంతోష్ (45) గత కొంత కాలంగా కుభీర్ మండలంలోని చాత గ్రామంలో కూలీగా పనులు నిర్వహిస్తు జీవిస్తున్నాడు. మద్యానికి బానిసగా మారిన సంతోష్ తనకు వచ్చే కూలీ డబ్బులు సరిపోకపోవడంతో చిన్నపాటి చోరీలకు పాల్పడేవాడు. ఇదే క్రమంలో ఈ నెల 17న రాత్రి గ్రామంలో కల్లు విక్రయించే బలరాం గౌడ్ ఒంటరిగా ఉండటాన్ని పసిగట్టిన నిందితుడి ఆయన ఇంటికి చోరీ చేసేందుకు వెళ్లాడు. ఈ సమయంలో భోజనం చేస్తున్న బలరాం గౌడ్ అలికిడి విని చూడగా సంతోష్ ఇంట్లోకి చొరబడి రావడాన్ని గుర్తించి ఎందుకు లోనికి వస్తున్నావంటూ ప్రశ్నించాడు. ఇదే సమయంలో నిందితుడు సంతోష్ తన వద్దనున్న కత్తితో బలరాం గౌడ్‌పై దాడికి తెగబడ్డాడు. దీంతో ఆయన కిందపడగా గొడ్డలితో కిరాతకంగా గొంతు నరికి ఆయనను పాశవికంగా హత్య గావించాడు. అనంతరం బీరువా పగులకొట్టి అందులోని రూ.1.5 లక్షల నగదును అపహరించుకొని వెలుతూ ఇంట్లో గ్యాస్ సిలెండర్ పైప్ లీక్ చేసి వెలిగించి అక్కడి నుంచి ఉడాయించాడు. అదృష్టవశాత్తు సిలిండర్ పేలకపోవడంతో పెను ముప్పు తప్పింది. సంబంధిత ఘటనపై మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడైన సంతోష్ ఇంట్లో రూ.1.5 లక్షల నగదును గుర్తించి విచారించగా నిందితుడి తల్లి పొంతన లేని సమాధానాలు చెప్పింది. ఇదే తడవుగా నోట్ల కట్టలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించగా అవి కామారెడ్డి జిల్లా మాచారం ఎస్‌బీఐ బ్యాంక్ లేబుల్‌తో ఉన్నట్లుగా గుర్తించారు. హతుడి కుటుంబీకుల నుంచి వివరాలు అడిగి తెలుసుకోగా తాము మాచారెడ్డి ప్రాంతంలో వ్యవసాయ భూమి అమ్మగా అక్కడి వారు బ్యాంక్ నుంచి బంగారు అభరణాలు తాకట్టు పెట్టి రుణం తీసుకొని డబ్బులు చెల్లించినట్లుగా వివరించారు.దీంతో పోలీసు అధికారుల బృందం అక్కడి పోలీసు అధికారుల బృందానికి సమాచారం అందించి వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో బలరాం గౌడ్‌ను హత్య చేసింది సంతోష్ అని నిర్ధారించుకున్నాక పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు గుర్తించినట్లుగా తెలుసుకున్న సంతోష్ ఇంట్లోనున్న మిగతా నగదును తీసుకొని పరారవుతుండగా మంగళవారం కుభీర్ మండలం హల్దా క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నట్లు ఏఎస్పీ అవినాష్ వెల్లడించారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిల ప్రత్యేకంగా అభినందించినట్లుగా వివరించారు.

అంగన్‌వాడీలో బాలుడిపై పడిన ఫ్యాన్



గాయపడిన బాలుడు

కుభీర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రంలో ఊడిపడ్డ సీలింగ్ ఫ్యాన్‌తో బాలుడి తలకు తీవ్ర గాయాలయిన ఘటన నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని కస్రా గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం వినోద్ దంపతుల కుమారుడు విరాజ్(03) అనే బాలుడిపై కస్ర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించారు. కాగా మధ్యాహ్నం సమయంలో కేంద్రంలో ఆడుకుంటున్న బాలుడి తలపై ఒక్కసారిగా సీలింగ్ ఫ్యాన్ ఊడి పడింది. ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. తలకు ఐదు కుట్లు పడ్డాయి. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ ఇన్‌చార్జీ సీడీపీవో రాజశ్రీ , సూపర్‌వైజర్ తహసీల్దార్ శివరాజ్ కస్ర గ్రామానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. బాలుడి వైద్యానికి అయ్యేఖర్చు మొత్తం ఐసీడీఎస్ ద్వారా చెల్లిస్తామన్నారు.

రైతులు పొలాల్లో జాగ్రత్తగా ఉండాలి

● వచ్చే మూడురోజులు అతి భారీ వర్షాలు

● సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సలియా

ముథోల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రానున్న మూడురోజుల్లో అతి భారీవర్షాలు ఉన్నందున జిల్లాలో రైతులు విద్యుత్ పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సలియా నాయక్ తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు ముఖ్యంగా రైతులు విద్యుత్ పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని కోరారు. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్‌కు సంబంధించిన పనులు ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని వివరించారు. ప్రమాదకరంగా ఉన్నటువంటివి గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి టీజీఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నెంబర్ 1912 ద్వారా తెలియచేయగలరని వివరించారు. పశువుల యజమానులు మేతకు తీసుకువెళ్లినప్పుడు కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల దగ్గరికి వెళ్లకుండా కాపరి వాళ్లు జాగ్రత్తవహించాలని కోరారు.

మునిసిపల్ పీఠం కైవసమే లక్ష్యంగా ముందుకు సాగండి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావ్



రాంచందర్‌రావ్‌ను కలిసిన ప్రతినిధుల బృందం

భైంసా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో మునిసిపల్ పీఠం కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకొని పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావ్ భైంసా పట్టణ బీజేపీ శ్రేణులకు సూచించారు. బుధవారం భైంసాకు చెందిన పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎనుపోతుల మల్లేశ్వర్,మాజీ వైస్ చైర్మెన్ తోట లింగురామ్, మాజీ కౌన్సిలర్ గౌతం పింగ్లే, సోషల్ మీడియా కన్వీనర్ కాసర్ల ప్రవీణ్ ,పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులు గాలి రాజన్న,వెంకటేష్, కార్యదర్శులు సందుల శంకర్, చర్ల సుభాష్, ప్రతినిధులు బండారి దిలీప్, భీమా శంకర్‌ల నేతృత్వంలో ఆయా వార్డుల పార్టీ ప్రతినిధులు హైదరాబాద్‌లో పార్టీ చీఫ్ రాంచందర్‌రావ్‌ను కలిశారు. ఇందులో భాగంగా పార్టీ చీఫ్ రాంచందర్‌రావ్ భైంసా బీజేపీ శ్రేణులతో మమేకమై మాట్లాడారు. ఈ దఫా జరిగే ఎన్నికల్లో ఎంఐఎం అధిపత్యాన్ని తుదముట్టించి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకొని కాషాయ జెండా ఎగురవేయాలని పేర్కొన్నారు. అనుబంధ సంస్థలన్నింటినీ సమన్వయం చేసుకొని మున్సిపల్ సంగ్రామానికి సన్నద్ధం కావాలని, ఆ మేరకు ముందుకు సాగాలని తెలిపారు.

ఆర్జీయూకేటీ మూడోవిడతా జాబితా విడుదల



బాసర ఆర్జీయూకేటీ ప్రధాన ప్రవేశ ద్వారం

● ఈ నెల 25న కౌన్సెలింగ్

● మిగిలిపోయిన గ్లోబల్ కోటా సీట్లకు 24న

బాసర, జూలై23 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ, కొత్తగా ఏర్పాటు కానున్న మహబూబ్‌నగర్ సెంటర్ కోసం రాబోయే విద్యాసంవత్సరానికి ప్రవేశానికి సంబంధించిన మూడోవిడత జాబితాను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ అధికారులు బుధవారం ప్రకటించారు. మొదటి రెండో విడతాల్లో కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లను మూడోవిడతలో భర్తీ చేయనున్నట్లు చెప్పారు. మూడో విడత విద్యార్థులకు ఈ నెల 25 తేదిన కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా గ్లోబల్ కోటాలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు గ్లోబల్ కోటా ఎంచుకున్న వారి కోసం ఈ నెల 24న కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

● త్వరలో ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా సీట్ల భర్తీ

ఎన్‌సీసీ స్పోర్ట్స్ కోటా సీట్ల భర్తీ త్వరలో చేపట్టనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు.ఇప్పటికే ఈ కోటా కింద దరఖాస్తు చెసుకున్న విద్యార్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తి అయింది. ఎంపిక జాబితా విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ప్రత్యేక కేటాగిరికి సంబంధించి ఆయా నిపుణుల పరిశీలన కారణంగా కొంత ఆలస్యమైనట్లు చెప్పారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్ టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువుల కొరత రాకుండా అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ మినీట్యాంక్ బండ్ సమీపంలోని గాయత్రి ఫర్టిలైజర్‌తో పాటు కొండాపూర్ గ్రామంలోని శ్రీ సాయి ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ప్యాకింగ్ లేబుళ్లు, తయారీ దారుల వివరాలు, గడువు తేదీలు, రిజిస్టర్లు, రసీదుల పుస్తకాలను పరిశీలించారు. అన్ని రికార్డులు సరిగ్గా నిర్వహించాలని యజమానులకు సూచించారు. రైతులకు అవసరమైన పరిమాణంలో మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. ఎరువుల కొనుగోలుకు వచ్చిన రైతులతో మాట్లాడిన కలెక్టర్ వారు సాగు చేసిన పంటలు, భూమి విస్తీర్ణం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు నకిలీ విత్తనాలు, మందులు కొనకూడదని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎరువులు, క్రిమిసంహారక మందులు భూసారానికి అనుగుణంగా వాడాలని, అధికంగా వాడితే దిగుబడిపై ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్లు రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్



కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

భైంసా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): యువతులు, మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి వైపు దృష్టి సారించి ఆర్థిక పురోభివృద్ధిని సాధించాలని ముథోల్‌ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ పిలుపునిచ్చారు. బుధవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మంజూరైన కుట్టు మిషన్లను లబ్ధి దారులకు పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పురుషులకు దీటుగా మహిళలు, యువతులు అన్ని రంగాల్లో దీటుగా రాణించే దిశగా ముందుకు సాగాలన్నారు. ప్రధానంగా స్వయం ఉపాధితో ప్రగతి బాటలో పయనించేందుకు కృషి చేయాలన్నారు. కుటుంబపోషణ, నిర్వహణ బాధ్యతలతో తమ వంతు భాగస్వామ్యాన్ని అందించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇందులో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఆర్.మోహన్ సింగ్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ ప్రతినిధులు సోలంకే భీంరావ్ పాటిల్, వెంగళ్‌రావ్, ఖత్‌గావ్ గ్రామ మాజీ సర్పంచ్ రాజు, మారుతి పాటిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.